క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన రాజ్యసభ అభ్యర్థి బాబూరావు



తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న గొల్ల బాబూరావు

దెందులూరు: రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కొవ్వలి వాసి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సోమవారం తాడేపల్లి ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా వైఎస్సార్ సీపీ తరఫున గొప్ప అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప మనస్సును తాను ఎన్నటికీ మరువనని ఈ సందర్భంగా బాబూరావు అన్నారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాలకు నూతన హాలు సిద్ధం



గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నూతన హాలును సిద్ధం చేసిన దృశ్యం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో ఉత్సవాలకు గ్రామానికి చెందిన దాత గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతులు నిర్మించిన హాలును ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ నెల 16 నుంచి అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతున్న సంగతి విదితమే. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి ఆలయ ప్రాంగణంతో పాటు మరింత మంది కూర్చోవడానికి దాతలు హాలును నిర్మించారు.

నగదు రహిత లావాదేవీలు అలవాటు చేసుకోవాలి

ఉంగుటూరు: నగదు రహిత లావాదేవీలు అందరూ అలవాటు చేసుకోవాలని ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి అన్నారు. సోమవారం ఎ.గోకవరంలో కైకరం స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. సర్పంచి మిద్దే సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యవతి మాట్లాడుతూ నగదు రహిత సేవల వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని అన్నారు. ఎంపీటీసీ విజయనిర్మల, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు



పూళ్లలో మంచినీటి చెరువును కమ్మేసిన పొగమంచు

భీమడోలు: కొన్ని రోజులుగా తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటలకు వరకు పొగ మంచు కమ్మేస్తోంది. ఫిబ్రవరి ఆరంభం నుంచి ఉదయం మంచు కురుస్తుండగా, పగటి ఉష్ణోత్రలు బెంబేలెత్తిస్తున్నాయి. దీనితో ఉదయం వాతావరణమంతా పొగ మంచు దుప్పటి తొలగక వివిధ పనుల కోసం వెళ్లే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముందు వెళ్లే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని వాహన చోదకులు రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ, రాష్ట్రీయ రహదారులపై మంచు తెరలు కప్పేయడంతో వాహనాలు ఛెమ్మదిగా వెళ్తున్నాయి. కొన్ని రోజులు వరకు ఇదే పరిస్థితి ఉంటుందని పర్యావరణ నిపుణులు అంటున్నారు. దీని ప్రభావంతో పిల్లలు, పెద్దలు అనారోగ్యబారిన పడుతున్నారు.

నీటి పొదుపు పాటించాలి

గణపవరం: వంతులవారీ సాగునీటి విడుదల ప్రారంభించారని, రైతులు నీటిని పొదుపుగా వాడుకుని అధిక దిగుబడి సాధించాలని తాడేపల్లిగూడెం డివిజన్ ఏడియే మురళీ కృష్ణ రైతులకు సూచించారు. సోమవారం గణపవరం ఆర్‌బీకే వద్ద మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కె.జగపతి రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతులంతా ఈనెల 15వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఏడీఏ సూచించారు. మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీనివాసులు

పెదవేగి : పెదవేగి ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న బి శ్రీనివాసులును ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వె ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల బదిలీలో భాగంగా పెదవేగిలో కొద్ది రోజుల క్రితం ఇక్కడ పనిచేసిన వెంకటరమణ సెలవు పెట్టి వెళ్లడంతో శ్రీనివాసులును ఇన్‌చార్జ్‌గా జిల్లా అధికారులు నియమించారు.

భవిష్యత్తు బంగారుమయం

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- బైజూస్ కంటెంట్‌తో డిజిటల్ పాఠాలు

ఏలూరు రూరల్ : కంప్యూటర్ పరిజ్ఞానం, డిజిటల్ విద్యాబోధన గత పాలకుల హయాంలో సర్కారు బడుల్లోని విద్యార్థులకు అందని ద్రాక్షగా ఉండేది. ఫలితంగా సాంకేతిక నైపుణ్యాన్ని, కంప్యూటర్ ఆధారిత అభ్యాసనాన్ని అందుకోలేక పేద విద్యార్థులు సతమతమయ్యేవారు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలో చదువుకునే విద్యార్థులతో పోటీపడి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు సాధించలేక అవస్థలు పడేవారు. నేడు పరిస్థితి మారింది. ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న బాలబాలికలకు ట్యాబ్‌లు అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారింది. హైస్కూల్ స్థాయి నుంచి విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన విద్యా విధానాన్ని అలవర్చుకునేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా భవిష్యత్తులో పేద విద్యార్థులు సైతం సాఫ్ట్‌వేర్ రంగంలో ఇతరులతో పోటీ పడే అవకాశం పెరిగింది. కంప్యూటర్ విద్య, డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి రావడంతో అసమానతలు తొలిగిపోనున్నాయి. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగంలో పట్టణ ప్రాంత విద్యార్థులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే పేద విద్యార్థులు సైతం అద్భుతాలు సాధించే అవకాశం రానుంది.



వెంకటాపురం మండల పరిషత్ పాఠశాలలో ట్యాబ్‌లు అందుకున్న బాలబాలికలు

గ్రామాల వారీగా వివరాలు

ఏలూరు రూరల్ గ్రామాల్లోని 8 ప్రభుత్వ జెడ్పీ పాఠశాలలో 8, 9వ తరగతి చదివే 826 విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించింది. గతేడాది 426 మందికి, ఈఏడాది రెండోసారి మరో 400 మంది బాలబాలికలకు విద్యాశాఖ అధికారులు ట్యాబ్‌లు అందించారు.

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల విలువ

చాటపర్రు	రూ.16,32,986
పైడిచింతపాడు	రూ.8,36,326
ప్రత్తికోళ్లలంక	రూ.10,68,546
కోటేశ్వరదుర్గాపురం	రూ.2,18,998
కోమటిలంక	రూ.2,71,886
శ్రీపర్రు	రూ.16,72,652
పెదయాగనమిల్లి	రూ.1,32,110
గుడివాకలంక	రూ.18,38,762
జాలిపూడి	రూ.10,28,880
మల్కాపురం	రూ.10,02,436
మాదేపల్లి	రూ.10,94,990
మొత్తం	రూ.1,07,98,572

మంచి అవకాశం



8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించడం మంచి ఆలోచన. పాఠ్యాంశాన్ని బైజ్యూస్ కంటెంట్ ద్వారా వీడియో రూపంలో మరోసారి మననం చేసుకోవడం వల్ల పాఠాన్ని మరింతలోతుగా అర్థం చేసుకోవచ్చు. చాప్టర్ వారీగా పరిశీలన, మాదిరి పరీక్షలు, కంటెంట్ ట్యాబ్‌ల్లో పొందుపర్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు భవిష్యత్తులో రాణించవచ్చు.

– సింహం జస్వంత్, ట్రిపుల్ ఐటీ, స్టూడెంట్, మాదేపల్లి

విప్లవాత్మక మార్పు



పేద విద్యార్థుల భవిష్యత్తుకు తిరుగులేని భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. విద్య ద్వారానే జీవితాల్లో మార్పు వస్తుంది. అందుకే ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంతో పాటు బైజూస్ డిజిటల్ కంటెంట్‌తో పిల్లలకు ట్యాబ్‌లు అందిస్తోంది. ఉపాధ్యాయులు చెప్పే పాఠం వినడంతో పాటు యానిమేటెడ్ విధానంలో వీడియో రూపంలో విద్యార్థులు చూడడం వల్ల విద్యపై మరింత ఆసక్తి పెరుగుతుంది. అంతర్జాతీయస్థాయిలో మన విద్యార్థులు పోటీ పడగలరనే నమ్మకం కలుగుతోంది.

– పువ్వుల ఆంజనేయులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

గోపినాథపట్నంలో పాఠశాల రికార్డుల పరిశీలన



గోపినాథపట్నం పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న గుళ్ల ప్రసాదరావు

ఉంగుటూరు: ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు విద్యా ప్రమాణాలపై ఉంగుటూరు మండలంలోని అన్ని పాఠశాలలను కాంప్లెక్సుల వారీగా వేరే కాంప్లెక్సు చైర్మన్లు మూడురోజుల పాటు తనిఖీ చేయాలని ఆదేశాలు వచ్చాయని కైకరం కాంప్లెక్సు చైర్మన్ గుళ్ల ప్రసాదరావు తెలిపారు. సోమవారం గోపినాథపట్నం పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను, రికార్డులను, తరగతుల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, తాగునీటి లభ్యతను పరిశీలించి, ఉపాధ్యాయులతో పలు అంశాలపై మాట్లాడినట్టు ప్రసాదరావు వివరించారు.

నేడు కొవ్వలిలో ఉచిత మెగా వైద్యశిబిరం

దెందులూరు: కొవ్వలి గ్రామం మొటపర్తి భవన్‌లో మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు ఎస్.శివశంకర్ తెలిపారు. కార్డియాలజీ, సుగర్, బీపీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, రుమటాలజీ, పీడియాట్రిక్‌కు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందిస్తారని తెలిపారు.

‘స్పందన’కు మండల అధికారుల గైర్హాజరు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి మండల అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం ముగ్గురు మాత్రమే స్పందనకు హాజరయ్యారు. తహసీల్దార్ తరఫున స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ పీ.శ్రీలత, ఈఓపీఆర్డీ స్వామి హాజరయ్యారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా స్పందన కార్యక్రమం ఉపయోగపడుతోంది. జవాబుదారీతనంతో స్పందన ఏర్పాటు చేస్తే అందుకు భిన్నంగా మండలాధికారులు పట్టుమని గంట సమయం కూర్చునేందుకు విముఖత చూపుతున్నారు. ఎంఈఓ, వైద్యాధికారి, పశువైద్యాధికారి, అన్ని శాఖల ఏఈలు, ఆర్డీసీ,



స్పందన కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ, స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్

మైనింగ్, దేవాదాయ శాఖ, హాస్టల్ ఏఓ, డ్రైయిన్స్, ఇరిగేషన్, రెవెన్యూ, హోమియో ఇలా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన శాఖల మండలాధికారులు ఎవరూ రాకపోవడం గమనార్హం. జాయింట్ కలెక్టర్, కలెక్టర్ పకడ్బందీ పర్యవేక్షణ లేకపోవడం, హాజరుకాని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదు దీంతో తూతూ మంత్రంగా స్పందన నిర్వహిస్తున్నారు.

గైర్హాజరైన వారిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి

స్పందన కార్యక్రమానికి హాజరు కాని మండలాధికారులపై కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చర్యలు తీసుకోవాలని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమానికి గైర్హాజరైతే సహించేది లేదని ఆమె అన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు చిరంజీవికి ఆహ్వానం

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా సంతాన లక్ష్మిగా పేరొందిన దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 67 వార్షికోత్సవ మహోత్సవాలను ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఉత్సవాలకు విచ్చేయాలని పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవికి గాలాయగూడెం ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్ వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ బిరుదు ఇచ్చిన సందర్భంగా గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి కమిటీ సభ్యులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. కమిటీ సభ్యులు నాని, వేగుంటవెంకట కిషోర్, తోట నాని,



అమ్మవారి ఉత్సవాలకు పద్మవిభూషణ్ చిరంజీవికి ఆహ్వానం పలికిన కమిటీ సభ్యుడు

డాక్టర్ కార్తిక్, రవీంద్ర జైపాల్, తీగల రమేష్, పూజారి అచ్యుత రామయ్య బాబూ ఇతరులు ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

సీఎం జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- కైకరంలో సచివాలయ, ఆర్‌బీకే భవనాల ప్రారంభోత్సవం
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఉంగుటూరు: సంక్షేమంతోపాటు అభివృద్ధికి వైఎస్ జననన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చేసిన దాఖలాల్లేవని వాసుబాబు స్పష్టం చేశారు. సోమవారం ఉంగుటూరు మండలం కై కరంలో 1.43 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన రెండు సచివాలయాలు, రెండు ఆర్‌బీకే భవనాల



కైకరంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రారంభోత్సవం నిర్వహించారు. ఒక్కో సచివాలయ భవనం రూ.47.60 లక్షల వ్యయంతో నిర్మించారు. రెండు భవనాలను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభించారు. ఒక్కో భవనం రూ.23.94 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు ఆర్‌బీకే భవనాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో సీసీ రహదార్లు, డ్రెయినేజి వ్యవస్థ, పాఠశాలలు భవనాలను అభివృద్ధి చేశామన్నారు. నూతన సచివాలయ భవనాలు, ఆర్‌బీకే భవన నిర్మాణాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభించామన్నారు. కై కరం గ్రామ క్యాడర్ ఆనందోత్సాహాల నడుమ ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ ఘంటా శ్రీలక్ష్మి, బీసీ నియోజకవర్గ నాయకుడు కొరిపల్లి శ్రీను, ఎస్సీ,ఎస్టీ మోనిటరింగ్ సభ్యుడు గంజీ ప్రభాకరరావు, ఉపసర్పంచి మురళీ, ఎంపీటీసీ సభ్యులు పంతులు వెంకన్న, పేద్ద అప్పన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క శ్రీను, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నాయకులను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులు, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



గొల్ల బాబూరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్

నేడు గుండుగొలనులో ఆసరా చెక్కుల పంపిణీ

భీమడోలు: గుండుగొలనులోని రైతు సహకార వేదికలో ఈనెల 13వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు సోమవారం రాత్రి తెలిపారు. గుండుగొలనులో నిర్వహించనున్న సభలో గుండుగొలను, లక్ష్మీపురం, కోరుకల్లు గ్రామాలకు చెందిన డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా రుణమాఫీ చెక్కులను అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎ స్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

భారీ ర్యాలీ



కూచింపూడి రహదారిలో వైఎస్సార్ సీపీ శ్రేణుల బైక్ ర్యాలీ



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, నాయకులు

సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దెందులూరు నియోజకవర్గంలో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కూచింపూడిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

– పెదవేగి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పెదపాడు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ఆయన అన్నా రు. దెందులూరు, పెదపాడు మండలంలోని పాతపెదపాడు, రాజుపేటలో ఏలూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్బయ్యచౌదరి ప్రజలకు అభివాదం చేస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పాతపెదపాడులో మంచినీటి చెరువును అభివృద్ధి చేయాలని, రాజుపేటలో డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరడంతో దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాయుడుగూడెంలో, పెదపాడులో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందించారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఘన విజయం అందించాలని కోరారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్,



పాత పెదపాడులో ప్రజా ఆశీర్వాదయాత్రలో బాలికతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు

రాజుపేట సర్పంచ్ తొందురు క్రాంతికుమార్, గుణుపూరు మహేష్, గారపాటి భాస్కరరావు, బత్తుల ఏసురాజు, విమలారావు పాల్గొన్నారు.

నేడు వసంతవాడలో ప్రజా ఆశీర్వాదయాత్ర

పెదపాడు: మండలంలోని వసంతవాడలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహిస్తారని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి తోటగూడెం, పునుకొల్లులో ప్రజా ఆశీర్వాద యాత్ర కొనసాగించి, అనంతరం అప్పనవీడులో రాత్రి బస చేస్తారని చెప్పారు.

అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, చిత్రంలో జెడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ

పెదపాడు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చిత్రంలో జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. పెదపాడు మండలంలోని రాజుపేటలో వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగనన్న విజయవాడలో 250 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించారని గుర్తు చేసారు. మహనీయుడు బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాజుపేటలో ఏర్పాటు చేయడం మంచి పరిణామమని వారన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లో పయనిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవ కాంతం, ఏలూరు మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, అంబేద్కర్ యూత్ సభ్యులు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవి కుమార్, రాజుపేట సర్పంచ్ తొందురు క్రాంతికుమార్, గుణుపూరు మహేష్, బత్తుల ఏసురాజు, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.